క్లుప్తంగా

ఘనంగా మద్దిరావమ్మ జాతర


అమ్మవారిని గ్రామంలో ఊరేగిస్తున్న దృశ్యం

కాళ్ల: మద్దిరావమ్మ జాతర మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో కొలువుతీరి ఉన్న మద్దిరావమ్మ జాతర మహోత్సవం వైభవంగా, భక్తి శ్రద్ధలతో జరిపారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి గ్రామంలో జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. జాతర మహోత్సవం లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విచిత్ర వేషధారణలు అఘోర వేషధారణలు అందర్నీ ఆకట్టుకున్నాయి. జాతరలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మద్యం, బెల్టు షాపులు ఏర్పాటు చేయొద్దని వినతి


ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

ఆకివీడు: స్థానిక 14వ వార్డులో మద్యం, బెల్టు షాపులను ఏర్పాటు చేయవద్దని ఐద్వా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేసి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావుకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా పట్టణ కార్యదర్శి ఉదయ్ కుమారి మాట్లాడుతూ 14వ వార్డులో జనావాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని ఆ ప్రాంత ప్రజలు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై సీఐకి వినతి పత్రం అందజేయగా బెల్టు షాపు తొలగిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు డోకల లక్ష్మి, బీ.కల్యాణి, కృష్ణవేణి, రమణ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

మోగల్లు అరుంధతీ పేటలో వైద్య శిబిరాలు నిర్వహించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పాలకోడేరు మండలంలోని మోగల్లు అరుంధతీ పేటలో ప్రజలకు ప్రబలిన విషజ్వరాలు, చికెన్ గున్యా, కీళ్ళ నొప్పులు వంటి వాటికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని, తక్షణమే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు కోరారు. గురువారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావుకు కెవిపిఎస్ బృందం వినతి పత్రం అందజేశారు. అనంతరం జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు మాట్లాడుతూ తక్షణం మెడికల్ క్యాంపులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కింతాడ రమేష్ తదితరులు ఉన్నారు.

రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వరరావు

పాలకొల్లు సెంట్రల్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్కానింగ్, డాక్యుమెంటేషన్ అన్నీ సక్రమంగానే ఉన్నాయని జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణ సబ్ రిజిస్ట్రార్‌పై వచ్చిన ఆరోపణలపై కార్యాలయాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ రోజు చేసిన పరిశీలనలో ఎలాంటి సమస్యలు లేవని అన్నారు. అవినీతి ఆరోపణలు చేసిన వ్యక్తులను, రిజిస్టేషన్ కోసం వచ్చిన వ్యక్తులను విచారణ చేశామని తాము ఎవ్వరూ ఎలాంటి ఫిర్యాదులు చేయలేదని మాకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వలేదని తెలిపారని వెంకటేశ్వరరావు చెప్పారు. దీని పై ఇంకా పూర్తివిచారణ చేయనున్నట్లు సబ్ రిజిస్ట్రార్ సుధారాణి పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

నరసాపురం: కార్తీకమాసం నేపథ్యంలో నరసాపురం డిపో నుంచి పంచారామ క్షేత్రాలను దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక బస్సులు తిప్పుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం రాత్రి బయలుదేరే ఈ బస్సులు సోమవారం ఒక్క రోజులునే అన్ని క్షేత్రాలను దర్శించి తిరిగి నరసాపురానికి చేరుకుంటాయని వివరించారు. నవంబర్ 3,10,17,24 తేదీల్లో నరసాపురం బస్టాండ్ నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరతాయన్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సూపర్‌లగ్జరీ బస్సులు నడుపుతున్నామని చెప్పారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు. అలాగే శబరిమల, శ్రీశైలం వెళ్లే యాత్రీకులకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఏర్పాటు చేస్తామని వివరించారు.ఈ అవకాశాన్ని మాలదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలనీల్లో తాగునీటి వెతలు

- పైపుల అనుసంధానం చేయకపోవడం వల్ల నీటి సమస్య
- పట్టించుకోని ప్లబిక్ హెల్త్, మున్సిపల్ అధికారులు
- అదే బాటలో కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరంలో మంచినీటి ట్యాంకులు(ఓహెచ్ఆర్‌లు) ఉన్నప్పటికీ పట్టణ ప్రజలకు పుష్కలంగా తాగునీరు అందించలేకపోతున్నారు. భీమవరం పట్టణంలో పాత ట్యాంకులు 8 ఉండగా అమృత్ పథకంలో దుర్గాపురం, బీసీ కాలనీ, మార్కెట్ యార్డ్ ప్రాంతాల్లో మూడు వాటర్ ట్యాంకులు దాదాపు 1200 లీటర్ల సామర్థ్యంతో నిర్మించారు. గత ప్రభుత్వంలోనే వాటిని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడం జరిగింది. అయితే పైపుల అనుసంధానం చేయకపోవడం వల్ల వాటర్ ట్యాంకులకు పూర్తిస్థాయిలో నీళ్లు స్టోరేజీ చేసుకునే పరిస్థితి లేదు. దాంతో పాత ట్యాంకుల ద్వారానే భీమవరం పట్టణానికి మంచినీళ్లు సరఫరా చేస్తున్నారు. పైపు లైన్లు ఉన్న కూడా చివరి ప్రాంతాలకు మంచినీళ్లు అందజేయడం లేదు. మంచినీటి సమస్యతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కూడా పబ్లిక్, హెల్త్, మున్సిపల్ అధికారుల పట్టించుకోవడం లేదు. కోట్లు రూపాయల నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకులు పూర్తిస్థాయిలో వినియోగించుకునే పరిస్థితి లేకుండా పనులు చేశారు.

ఒక్కో ట్యాంకు 5 వార్డులకు మంచినీళ్లు అందిస్తుంది

అమృత్ పథకంలో నూతనంగా నిర్మించిన మూడు మంచినీళ్ల ట్యాంకుల్లో ఒక్కో ట్యాంకు 4 నుంచి 5 వార్డుల ప్రజలకు మంచినీళ్లు అందజేస్తున్నాయి. ఈ ట్యాంకుల పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే మంచినీటి సమస్య తీరుంది. మార్కెట్ యార్డ్ ప్రాంతంలో నిర్మించి మంచినీటి ట్యాంకు మెంటే వారితోట, నర్సయ్య అగ్రహారం, కుముదవల్లి రోడ్డు, ఎఫ్‌సిఐ కాలనీ, నాగేంద్ర స్వామి ఆలయ ఏరియా, ఇండస్ట్రియల్ ఏరియాకు నీళ్లు అందజేస్తుంది. దుర్గాపురం ట్యాంకు నుంచి దుర్గాపురం, లంకపేట, అరేటి నగర్, బైపాస్ రోడ్డు, మల్టీప్లెక్స్ ఏరియా, డిమార్ట్ ఏరియాకు నీళ్లు అందజేస్తుంది. బీసీ కాలనీ ట్యాంకు రామ్ లక్ష్మణ్ నగర్, బీసీ కాలనీ, ప్రకాష్ నగర్, డిఎన్ఆర్ కళాశాల ఏరియా, కొమరాడ రోడ్డు తదితర ప్రాంతాలకు నీళ్లు అందజేస్తుంది. కానీ పైపుల అనుసంధానం లేక పై ప్రాంతాలకు మంచినీళ్లు పుష్కలంగా అందడం లేదు.

చివరి ప్రాంతాలకు ట్రాక్టర్ ట్యాంకర్లే గతి

భీమవరంలో మొత్తం 11 వాటర్ ట్యాంకులు(ఓహెచ్ఆర్) ఉన్నప్పటికి పట్టణంలో పలు ప్రాంతాలకు మంచినీటి సరఫరా చేసే ట్రాక్టర్ ట్యాంకులే గతి అన్నట్లుగా ఉంది పరిస్థితి. నీళ్లు అందని ప్రాంతానికి వాటర్ ట్యాంకు ద్వారా 10 రోజుల లేదా 20 రోజులకు ఒకసారి నీళ్లు సరఫరా చేస్తున్నారు. దాంతో ఆయా ప్రాంతాల ప్రజలకు మంచినీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి ట్యాంకర్ కోసం ప్రజలు రోజుల తరబడి ఎదురుచూసే పరిస్థితి నుంచి నిత్యం పుష్కలంగా నీళ్లు అందే మంచి రోజులు కోసం భీమవరం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఓట్లు వేయించుకున్న ప్రజాప్రతినిధులు మాకు సంబంధం లేని విషయం అన్నట్లుగా ఉన్నారు. ప్రజలు మంచినీళ్ల లేక ఇబ్బందులు పడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు పట్టించుకోవడం లేదు.

పిట్టర్ల చేతివాటం:

మున్సిపాలిటిలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న పిట్టర్ల అనుమతులు లేకుండా అక్రమ కుళాయి కనెక్షన్లు ఇచ్చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్లాట్లుకు అధినంగా కనెక్షన్ ఇవ్వడానికి డబ్బులు తీసుకుంటారని ఆరోపణలు ఉన్నాయి. అక్రమణ కనెక్షలకు బిల్లు కూడా వసూళ్లు చేయడం లేదు. దాంతో మున్సిపాలిటికి ఆదాయం దెబ్బతింటుంది.

నిర్లక్ష్యంగా డీఈలు

మంచినీటి సరఫరా సంబంధించి పరివేక్షించే పబ్లిక్ హెల్త్ డీఈ, మున్సిపల్ డీఈలు నిర్లక్ష్యంగా ఉండడం వల్ల ట్యాంకులు వినియోగంలోకి వచ్చి ఏడాది అవుతున్న కూడా ఇప్పటివరకు పైపులను అనుసంధానం చేయలేదు. దాంతో నేరుగా ట్యాంకులల్లోకి నీళ్ల పంపింగ్ చేసే అవకాశం లేదు.. ఇప్పటికైన డీఈలు స్పందించి పైపుల అనుసంధానం పనులు పూర్తి చేస్తే ప్రజలకు ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.


దుర్గాపురంలో మంచినీటి ట్యాంకు

రెండు గ్రామాల్లో భూ-రీ సర్వే గ్రామ సభలు

ఉండి: మండలంలోని పాములపర్రు, కోలమూరు గ్రామాల్లో రీసర్వేపై గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో గతంలో జరిగిన రీ-సర్వేలో ఏవైనా తపొప్పులు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు రైతులను కోరారు. ఈ సందర్భంగా కోలమూరు గ్రామ సభలో తమ గ్రామంలో ఎన్నో ఇబ్బందులు ఉన్నాయని తూతూమంత్రంగా సభ జరిపితే కుదరదని తమకు ఓ రోజు కేటాయించాలంటూ రైతులు అధికారులను డిమాండ్ చేశారు. దీంతో కోలమూరులో మరోరోజు గ్రామ సభ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు నడింపల్లి సత్యవతి, నడింపల్లి రాంబాబు రాజు, కేశన శాంత కుమారి, ఆర్ఐ కార్తీక్, మండల సర్వేయర్ రత్నవలీ తదితరులు పాల్గొన్నారు.

కూటమిలో చెరువు చిచ్చు

ఆకివీడు: కూటమి నాయకులకు కొండయ్య చెరువు చిచ్చుపెట్టింది. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని కొండయ్య చెరువులో డంపింగ్ యార్డు ఏర్పాటుకు నగర పంచాయతీ తీర్మానం చేసింది. అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి 6.22 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొండయ్య చెరువును డంపింగ్ యార్డుగా మార్చేందుకు చేసిన తీర్మానానికి టీడీపీ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీలోని కొంత మంది కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. కూటమిలోని జనసేన కౌన్సిలర్లు ఇద్దరు, వైఎస్సార్‌సీపీలోని ఐదుగురు కౌన్సిలర్లు తీర్మానాన్ని వ్యతిరేకించి, సుప్రీం కోర్టు తీర్పును గౌరవించాలని, చట్టానికి లోబడి ప్రజా ప్రతినిధులు పని చేయాలని సూచించారు. మంచి నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన చెరువును చెత్త వేయడానికి మరల్చడం సరైన విధానం కాదని జనసేన వ్యతిరేకించింది. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని పూర్వీకులు ఏర్పాటు చేసిన చెరువును సద్వినియోగం చేసుకోకుండా వ్యర్థాల కోసం చెరువు ప్రాంతాన్ని నిర్వీర్యం చేయడం భావ్యం కాదని జనసేన కౌన్సిలర్లు, నాయకులు భావిస్తున్నారు. దీనిని ఎమ్మెల్యే దృష్టికి, పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళ్లి ఎట్టి పరిస్థితుల్లోనూ డంపింగ్ యార్డు తీర్మానాన్ని అమలు చేయకుండా చేయాలని యోచిస్తున్నారు. దీంతో కూటమి నాయకుల మధ్య చెరువు కుంపటిగా మారింది. ఈ వ్యవహారంపై టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు తలలు పట్టుకుంటున్నారు. చెరువు తీర్మానం అమలును రద్దు చేయాలని మూకుమ్మడిగా పోరాడాలని టీడీపీ నాయకులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. అయితే ఇరుపార్టీల నాయకులు ఏకాభిప్రాయానికి వచ్చే దాఖలాలు కనిపించడంలేదు. ఇదిలా ఉండగా అజెండాకు తీసుకువచ్చిన చెరువు తీర్మానం అంశంపై కమిషనర్ వివరణ ఇవ్వాల్సి ఉంది. అజెండాలోని తీర్మానం అంశంతో పాటే చెరువు ప్రాంతాల్ని పూడ్చకూడదని, ఆక్రమణలు చేపట్టకూడదని సుప్రీం కోర్టు తీర్పు ఉందని నోట్ రాయాల్సి ఉండగా ఏకపక్షంగా అజెండాను తీసుకువచ్చారనే ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. గతంలో గ్రామంలోని ధర్మాపుర అగ్రహారంలోని మంచినీటి చెరువు గట్టుపై వేసిన షెడ్డు నిర్మాణాన్ని 2011లో అప్పటి బోర్డు లోని ఉపసర్పంచ్, కొంత మంది సభ్యులు ఆమోదం తెలపడంతో హైకోర్టు ఆగ్రహించి, ఉపసర్పంచ్, ఆమోదం తెలిపిన సభ్యులను సస్పెండ్ చేసింది. తదనంతరం తీర్మానం చేయడం తప్పేనని సస్పెండ్ చేసిన సభ్యులు కోర్టుకు తెలిపి క్షమాపణ కోరడంతో సస్పెన్షన్ ఎత్తివేసింది. ప్రస్తుతం కొండయ్య చెరువు ప్రాంతాన్ని డంపింగ్ యార్డుగా మార్చాలని చేసిన తీర్మానంపై రానున్న రోజుల్లో ఏఏ చర్యలుంటాయోనని ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.

విద్యార్థులకు ఇన్నోవేషన్స్, ఇంటర్న్‌షిప్‌లు ఎంతో ప్రాముఖ్యత

భీమవరం: నూతన విద్యా విధానంలో విద్యార్థులకు ఇన్నోవేషన్స్, ఇంటర్న్‌షిప్‌లు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు అన్నారు. కళాశాల విద్యార్థులు ఇంటెర్న్‌షిప్‌లు, ఇన్నోవేషన్స్ నూతన ఆవిష్కరణ చేసేందుకు ఎస్ఆర్‌కెఆర్ కళాశాల వాద్వానీ ఫౌండేషన్‌తో గురువారం ఎంఓయూ కుదుర్చుకున్న సందర్భంగా మాట్లాడారు. ముందుగా ఎంఓయూకు సంబంధించిన పత్రాలను వాద్వానీ ఫౌండేషన్ ప్రతినిధి విష్ణు ప్రియతో కలసి మార్చుకున్నారు. అనంతరం జగపతిరాజు, మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో ఉన్న టెక్నాలజీ సెంటర్, ఐడియా ల్యాబ్ విద్యార్థుల నూతన ఆవిస్కరణలకు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. సిఎస్‌డి ఇన్‌ఛార్జ్ హెడ్, ఎంవోయు కోఆర్డినేటర్ ఎం సురేష్ బాబు మాట్లాడుతూ సిఎస్‌డి, సి, ఎస్ఐటి విభాగాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు, నలుగురు కళాశాల అధ్యాపకులు కూడా శిక్షణ పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎన్ గోపాలకృష్ణమూర్తి, వెట్ సెంటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్ శివకిషన్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఆర్‌కేఆర్ కళాశాల వాద్వానీ ఫౌండేషన్‌తో ఎంఓయూ కుదుర్చుకుంటున్న దృశ్యం

డ్వాక్రా సంఘాలు ఉత్పత్తులను పెంచాలి

ఆకివీడు: డ్వాక్రా సంఘాలు ఉత్పత్తుల్ని పెంచి, కుటీర పరిశ్రమలను అధికంగా ఏర్పాటు చేయాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక అయిభీమవరం టర్నింగ్ వద్ద ఏర్పాటు చేసిన డ్వాక్రా మహిళల స్టాల్స్‌ను గురువారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు కుటీర పరిశ్రమల్ని అధికంగా నెలకొల్పాలన్నారు. చిరు వ్యాపారాలను మరింతగా పెంపొందించాలన్నారు. నూతన ఉత్పత్తులను తయారు చేస్తూ మార్కెట్‌లో పేరు ప్రఖ్యాతలు సంపాదించాలన్నారు. చిన్న పరిశ్రమల్ని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకుల సహకారం మెండుగా ఉందన్నారు. స్టాల్‌లో 30 మంది మహిళలు తయారు చేస్తున్న వస్తువులను విక్రయించడం ద్వారా రూ. 25 వేలకు పైగా సొమ్ము వచ్చిందని మెప్మా అధికారి అనిల్ చెప్పారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఎండీ.జక్కి, యానిమేటర్లు పాల్గొన్నారు.


డ్వాక్రా స్టాల్స్‌లో వస్తువులను కొనుగోలు చేస్తున్న దృశ్యం

వసతి గృహాల పరిశీలన

భీమవరం: భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లా జడ్జి పి. విజయ దుర్గ బలుసుమూడిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర బధిరుల పాఠశాలను సందర్శించి పిల్లల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు కంటి సమస్యలు, దంత సమస్యలు, వినికిడి సమస్యలు ఉంటే మండల న్యాయ సేవా సంస్థకు తెలియజేస్తే సంబంధిత నిపుణులతో పరీక్షలు చేయిస్తామన్నారు. అనంతరం స్థానిక ఎల్ఐసీ ఆఫీసు ప్రక్కన ఉన్న బీసీ గవర్నమెంట్ కాలేజి విద్యార్థినుల హాస్టల్‌ను సందర్శించి పిల్లల్ని అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. రాత్రి వేళల్లో ఆకతాయిలు బైక్ సైలెన్సర్ తీసి శబ్దాలు చేసుకుంటూ హాస్టల్ మీదుగా తిరుగుతున్నారని, ఈ సమస్యను అరికట్టవలసిందిగా న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. న్యాయమూర్తి వన్ టౌన్ పోలీస్ వారికి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవలసిందిగా ఆదేశించారు.


హాస్టల్ విద్యార్థుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా జడ్జి పి. విజయ దుర్గ

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

భీమవరం: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా భీమవరం వన్‌టౌన్ పోలీసులు, విజ్ఞాన వేదిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వీఎస్‌కే డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వన్ టౌన్ సీఐ ఎం నాగరాజు హాజరై మాట్లాడుతూ ఇటీవల కాలంలో సెల్‌ఫోన్ , ఇంటర్నెట్ వినియోగం అధికం కావడంతో సైబర్ నేరగాళ్ల మోసాలు ఎక్కువయ్యాయని మధ్యతరగతి ప్రజలు కూడా మోసాల బారినపడి కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఏవీ రమణ, విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ నవీన్, ఎలియా తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలో వీఎస్‌కే డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న సీఐ నాగరాజు

ధరలను నియంత్రించాలి

భీమవరం: పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బలరాం డిమాండ్ చేశారు. గురువారం భీమవరంలో పార్టీ జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కర్రా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరల భారంతో సామాన్య ప్రజలే గాకుండా మధ్యతరగతి ప్రజలకు కూడా అవస్థలు పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ధరలను తక్షణం నియంత్రించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రకటించినా అమలు శూన్యమని విమర్శించారు. ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ కార్మికులు, ఇసుక ర్యాంపుల్లో పనిచేసే కార్మికులు ఉపాధిలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు తక్షణం రోడ్లు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, జెఎన్‌వి గోపాలన్, కౌరు పెద్దిరాజు, డి కళ్యాణి, బివాసుదేవరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బలరామ్

ఘనంగా యూఎన్‌ఓ దినోత్సవం

ఆకివీడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం యూఎన్ఓ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లయన్స్ ఆదర్శ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూఎన్ఓ ఆవశ్యకతపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ ఆదర్శ క్లబ్ కార్యదర్శి మోరా జ్యోతిరెడ్డి మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయంగా ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కార దిశగా చర్యలు చేపడుతుందన్నారు. సమితిలో అంతర్జాతీయ న్యాయస్థానం, ప్రపంచ బ్యాంకు, యూనెస్కో, భద్రతా మండలి ఉంటుందని చెప్పారు. దీనిలో ఐదు శాశ్వత సభ్యత్వం కలిగిన దేశాలున్నాయన్నారు. దీనిలో 193 దేశాలు భాగస్వామ్య సభ్యులుగా ఉన్నారని చెప్పారు. శాంతిని కాపాడటం, సభ్య దేశాల మధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొల్పడం, పేదరిక పరిస్థితుల్ని మెరుగు పరచడం, ప్రపంచాన్ని చుట్టుముట్టే భయంకర వ్యాధుల గురించి ముందుగానే తెలియజేయడం వంటి పలు చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు మోటుపల్లి సుబ్బారావు, నేరెళ్ల రామ చెంచయ్య, షరీఫ్ , అహ్మద్, హెచ్ఎం ఇందిర, పల్లి రంగారెడ్డి, వెంకటస్వామి, నెల్లి సతీష్, గోపి, నాజర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం.

నేటి నుంచి పెనుగొండ-పెరవలి రహదారి మూసివేత

పెనుగొండ: రహదారి విస్తరణ పనుల నిమిత్తం పెనుగొండ పెరవలి రహదారిలో శుక్రవారం నుంచి వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ఆర్ అండ్ బీ ఏఈ టీఆర్వీ ప్రసాద్ గురువారం విలేకరులకు తెలిపారు. పెనుగొండ పెరవలి రహదారి గతంలో విస్తరణ పనులు జరిగాయి, అయితే, పెనుగొండ పెరవలి రహదారిలో ఇరగవరం మండలం ఐతంపూడి, ఏలేటిపాడులవద్ద సాంకేతిక కారణాలతో విస్తరణ పనులు నిలిచిపోయాయి. దీంతో రాకపోకల రద్దీతో రహదారి కాస్తా పూర్తిగా ఛిద్రంగా మారింది. ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా ఫలితం లేకుండా పోయింది. తణుకు, నిడదవోలు, విజయవాడ వైపు వెళ్లడానికి ప్రధాన రహదారి కావడంతో నిత్యం రహదారి రద్దీగా ఉంటుంది. దీంతో కిలో మీటరు మేర రహదారి భారీ గోతుల మయంగా మారింది. కిలోమీటరు ప్రయాణం చేయడానికి కనీ సం 20 నిముషాలకు పైగా సమయం పడుతుంది. అయితే ప్రస్తుతం విస్తరణ పనులు పూర్తయితే, నరసాపురం, పాలకొల్లు, పెనుగొండ పరిసర ప్రాంతా ల ప్రజలు రాకపోకులు ఇబ్బందులు తప్పుతాయి.

దారి మళ్లింపు

పెరవలి వైపు వెళ్లే వాహనాలు అన్ని పెనుగొండ మండలం సిద్ధాంతం మీదుగా పెరవలి వైపు మళ్లిస్తున్నారు. తణుకు వెళ్లేవారు ఆలమూరు మీదుగాను వెళ్ల వచ్చని అధికారులు తెలిపారు.

నాణ్యతా లోపంతో రోడ్డు నిర్మాణం

భీమవరం అర్బన్: మండలంలోని భీమవరం నుంచి గూట్లపాడు రేవు పూర్తిగా ధ్వంసమైంది. భీమవరం నుంచి దేగాపురం, గొల్లవానితిప్ప, గూట్లపాడు రేవు వరకు సుమారు 11 కిలోమీటర్లు రూ. 11 కోట్లతో వేసిన ఆర్అండ్‌బీ రోడ్డు గోతులమయంగా మారింది. ఈ రోడ్డు మార్గం గుండా నిత్యం భీమవరం నుంచి వందలాది చేపలు ఐస్ బండ్లు, మేత లోడులు, స్కూల్ బస్సులు, కారులతో రద్దీగా ఉండి బరువాని పేట జాతీయ రహదారిలో కలుస్తాయి. నాలుగు నెలకే అధికారుల పర్యవేక్షణ లోపంతో నాణ్యతకు తిలోదకాలు వదిలి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారని పలువురు వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా మార్జిన్‌లో గ్రావెల్ వేయకపోవడంతో వర్షం వస్తే రోడ్డు ఎడ్జి వద్ద తరచూ వాహనాలు దిగబడిపోవడంతో పాటు, ద్విచక్రవాహనదారులు పడిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికై నా సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుకుంటున్నారు.


గొల్లవానితిప్ప రోడ్డులో గుంతలు పడిన దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరవాసరం: మండలంలో 33/11 కేవీ కొణితివాడ సబ్ స్టేషన్ నందు లైన్ మరమ్మతులు, చెట్లు కొమ్మలు తొలగించడం కారణం చేత కొణితివాడ, నేలపోగుల, ముదుగు పోలవరం, మడుగు పోలవరం లంక, బుదరాయుడు చెరువు, గవరపాలెం, అండలూరు, నవుడూరు, ఉనికిలి, ఇండస్ట్రియల్ ఫీడర్, వీరవాసరం సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ తోలేరు ఫీడర్ కూడా చెట్లు కొమ్మలు తొలగించుటకు మరియు చేపల చెరువులకు విద్యుత్ సరఫరా 25వ తేది శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.మధు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: భీమవరంలోని ఏపీ టీడ్కో ఇండోర్ విద్యుత్ ఉప కేంద్రం నుంచి పెదగరువు విద్యుత్ ఉప కేంద్రంనకు వెళ్లే 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లపై చెట్లు కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మతుల నిమ్మిత్తం పలు గ్రామాలలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ కోఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. తాడేరు, యమునాపల్లి, కొవ్రపాడు, బేతపూడి, కరుకువాడ, పెదగరువు, చినగరువు, రాజుల గరువు, వెంప, శ్రీరామపురం,దిరుసుమర్రు, పల్లిపాలెం, గొల్లగూడెం, శివాలయం సెంటర్, తుందుర్రు, జొన్నలగరువు గ్రామాలతో పాటు వీరవాసరం మండలంలోని దూసనపూడి, మత్స్యపురి పాలెం, కమతాలపల్లి, బాలేపల్లితో పాటు తుందుర్రులోని గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్కుకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉండి, పాలకోడేరులో..

ఉండి/పాలకోడేరు: ఉండి 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం, పాలకోడేరు మండలంలోని గొల్లలకోడేరులో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమ్మతులు, 11 కేవీ విద్యుత్ లైన్లపై ఆనుకుని ఉన్న చెట్లు కొమ్మలు తొలగించుట కోసం శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్(ఈఈ) ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉండి, పెదపుల్లేరు, చినపుల్లేరు, కలిసిపూడి, చెరుకువాడ, మహదేవపట్నం, చిలుకూరు, వెలివర్రు గ్రామాల్లో ఇండస్ట్రీయల్ లైన్లు, ఆక్వా చెరువులకు, అలాగే పాలకోడేరు మండలంలోని రగపర్రు, గొల్లలకోడేరు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

వీరవాసరం: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ ఏవి రామాంజనేయులు తెలిపారు. తోలేరులో గురువారం నిర్వహించిన రీ సర్వే రెవెన్యూ గ్రామసభల్లో పాల్గొని ఆయన మాట్లాడారు .రీ సర్వేలో ఏమైనా తప్పులు ఉంటే సవరించుకునే విసులుబాటు అందుబాటులో ఉందన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సిబ్బంది అంతా రైతుకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో డిటి సుబ్బారావు, ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, సర్పంచ్ వేంద్ర లీలా కృష్ణ పాల్గొన్నారు.

రేపు ఉండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉండి: ఉండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రవీంద్ర తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు హాజరువుతున్నారని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు విధిగా ఈ సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

మూడు నెలలకోసారి పంచాయతీలను తనిఖీ చేయాలి

పాలకొల్లు అర్బన్: ప్రతి మూడు నెలలకు ఒక సారి అన్ని పంచాయతీలను తనిఖీ చేసి సంబంధిత నివేదికలను తనకు అందజేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.జ్యోతిర్మయి సూచించారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డివిజన్‌లోని యలమంచిలి, పోడూరు, నరసాపురం, ఆచంట, మొగల్తూరు మండలాల్లోని గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్‌డీల సమీక్షా సమావేశంలో జ్యోతిర్మయి పాల్గొని మాట్లాడారు. పంచాయతీల్లో చెత్త, పిచ్చి మొక్కలు తొలగింపు, పన్నులు, పన్నేతరాల డిమాండ్ 24-25కి సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. నెలకు రెండు సార్లు ఓహెచ్ఎస్ఆర్ శుభ్రపరచాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అన్నింటినీ మనుగడలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీలు తాళ్ల మూర్తిబాబు, కేఎం వైభవతి, నవీన్‌కుమార్, జేడీవీ ప్రసాద్, నాగబాబు పాల్గొన్నారు.